కింద పడ్డానని ఆగిపోకు,
తిరిగి ప్రయత్నం చేస్తే
విజయం నీదే
- అబ్దుల్ కలాం

netisudiksha.online

నేటి సుదీక్ష
సమాజానికి సరైన దృక్పథం
SUDIKSHA TELUGU DAILY తెలుగు దినపత్రిక

హనుమకొండ సంపుటి 01 సంచిక 78 మంగళవారం ,ఆగస్టు 11, 2026 , పేజీలు - 4 వెల : 2.00 PRGI NO : TGTEL/26/A3170



**విలేకరులు కావలెను**

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా వెలువడుతున్న నేటి సుదీక్ష దినపత్రికలో,బ్యూరో, మండలాల రిపోర్టర్‌గా పని చేయుటకు జిల్లాల, నియోజకవర్గ స్థాయిల్లో ఉత్సహవంతులైన యువతి,యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును.

సంప్రదించవలసిన ఫోన్ నంబర్ 7288033333


# తెలంగాణలో ముగిసిన సర్ ప్రక్రియ




**హైదరాబాద్:** తెలంగాణలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎన్యూమరేషన్ ప్రక్రియ ముగిసింది. రాష్ట్రంలో మొత్తం 3,38,26,448 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు తేల్చారు. తెలంగా ణలో 73,95,954 మంది ఓటర్లను తొలగిం చినట్లు సమాచా రం. ఇప్పటివరకు 2,64,30,4 94 ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తయ్యింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా 78.14 శాతం డిజిట లైజేషన్ నమోదైంది. అత్యధికంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో 94.30 శాతం డిజిటలైజేషన్ పూర్తయ్యింది. ఆ తర్వాతి స్థానాల్లో మెదక్ 90.54 శాతం, సూర్యాపేట 90.43 శాతంతో ఉన్నాయి. ఇక, హైదరాబాద్ 27,74,687 ఎన్యూమరేషన్ ఫారాలతో 58.58 శాతం డిజిటలైజేషన్ పూర్తై చివరి స్థానంలో నిలిచింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 63.82 శాతం, రంగారెడ్డి జిల్లాలో 64.91 శాతం, కుమురం భీమ్ ఆసిఫా బాద్ జిల్లాలో 89.45 శాతం, జగిత్యాల జిల్లాలో 89.60 శాతం డిజిటలైజేషన్ పూర్త య్యింది. రెండు సార్లు గడువు పొడిగించినప్పటికీ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో డిజిటలైజేషన్ శాతం పెరగలేదు. కాగా, తెలంగాణలో సర్ ప్రక్రియ పూర్తయినట్లు ఈనెల 12న సీఈవో ప్రకటన చేయనున్నట్లు తెలుస్తోంది. అలాగే, ఈ నెల 17న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల కానున్నట్లు సమాచారం. ఆ తర్వాత నెల రోజుల పాటు అభ్యంతరాల స్వీకరణ కొనసాగనుంది. అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితా విడుదల కానుంది.

## ‘హర్ ఘర్ తిరంగా’తో ప్రతి ఇంటా దేశభక్తి చాటాలి



**హైదరాబాద్, ఆగస్టు 10:** ‘హర్ ఘర్ తిరంగా’తో ప్రతి ఇంటా దేశభక్తి చాటాలని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు పిలుపునిచ్చారు. (సోమవారం) తన ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఆగస్టు 14న ట్యాంక్ బండ్ దగ్గర భారీ ‘తిరంగా యాత్ర’ను నిర్వహిస్తున్నామ ని. పార్టీల కతీతంగా ప్రజలందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు చేపట్టిన ‘హర్ ఘర్ తిరంగా’ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని కోరారు.రాబోయే ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని, దేశం కోసం ప్రాణాలర్పించిన స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని రాంచందర్ రావు అన్నారు. అందులో భాగంగానే ఈరోజు ‘హర్ ఘర్ తిరంగా’ కార్యక్రమంలో పాల్గొని యువతతో కలిసి తన ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసినట్లు తెలిపారు. ప్రజలందరూ స్వచ్ఛందంగా ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ఇళ్లపై జెండాలు ఎగురవేయాలని కోరారు. అలాగే ఆగస్టు 14న హైదరాబాద్ ట్యాంక్ బండ్ దగ్గర చాలా పెద్ద ఎత్తున ‘తిరంగా యాత్ర’ నిర్వహిస్తున్నామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు వెల్లడించారు. హైదరాబాద్ ప్రజలందరూ కుల, మత, రాజకీయ విభేదాలను పక్కనబెట్టి, దేశం కోసం ఈ తిరంగా యాత్రలో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని రాంచందర్ రావు పిలుపునిచ్చారు.

# రైతుకు అండగా.. వ్యవసాయానికి భరోసాగా రాష్ట్ర ప్రభుత్వం

- రైతుల కోసం నెలకు సగటున రూ.5,250 కోట్లు ఖర్చు చేస్తున్నాం
- రైతు మేళాలో నేర్చుకున్న కొత్త సాగు పద్ధతులను తోటి రైతులతో పంచుకోవాలి
- రాష్ట్ర మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



**హనుమకొండ, ఆగస్టు 10, సుదీక్ష న్యూస్:** రైతును రాజుగా చేయాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు అంతగా అనుకూలంగా లేకపోయినా రైతు సంక్షేమానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆత్మ సౌజన్యంతో సోమవారం నిర్వహించిన జిల్లాస్థాయి రైతు మేళాను మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

### రైతు సంక్షేమానికి నెలకు రూ.5,250 కోట్లు

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం గత రెండేళ్లుగా అనేక ఒడిదుడుకులను అధిగమిస్తూ ముందుకు సాగుతోందన్నారు. గత ప్రభుత్వం రైతుల కోసం నెలకు సగటున రూ.2,500 కోట్లు ఖర్చు చేస్తే, ప్రస్తుత ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం వివిధ రూపాల్లో నెలకు సగటున రూ.5,250 కోట్లు ఖర్చు చేస్తోందని తెలిపారు.రైతు సంక్షేమంపై ప్రభుత్వం చూపుతున్న నిబద్ధతకు ఈ వ్యయం నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు. రైతులకు అవసరమైన సమయంలో ప్రభుత్వ సహకారం అందిస్తూ వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు.

### ధాన్యం కొనుగోళ్లకు ప్రభుత్వం పూర్తి మద్దతు

యాసంగి సీజన్‌లో రైతులు కష్టపడి పండించిన ధాన్యానికి ప్రభుత్వం పూర్తి మద్దతు అందించిందని మంత్రి తెలిపారు. ధాన్యం కొనుగోలు సమయంలో కొన్ని ప్రాంతాల్లో ఇబ్బందులు ఎదురైన విషయం వాస్తవమేనని, గతంలో తగిన గోదాముల నిర్మాణం, ధాన్యం నిల్వకు అవసరమైన మౌలిక వసతులు కల్పించకపోవడం వల్ల సమస్యలు ఏర్పడ్డాయని వివరించారు.

ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గోదాముల నిల్వ సామర్థ్యాన్ని దాదాపు రెట్టింపు చేసిందని చెప్పారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం స్పష్టమైన హామీతో ముందుకు వెళ్తోందని, రైతుల పక్షాన నిలబడే ప్రభుత్వం ఇదేనని స్పష్టం చేశారు.

### భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం

రైతులు, భూ యజమానులు ఎదుర్కొంటున్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. భూ రికార్డులను ప్రక్షాళన చేసి రైతులు, భూ యజమానులకు స్పష్టమైన హక్కులు కల్పించేందుకు చర్యలు




చేపడుతున్నామని అన్నారు.భూభారతి విధానం ద్వారా భూములకు స్పష్టమైన హక్కులు, టైటిల్, భూ రికార్డులు, మ్యాప్ తదితర వివరాలను అందించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. రైతులు, భూ యజమానులు తమ భూములకు సంబంధించిన వివరాలను అందించి సమగ్ర భూ సర్వేకు సహకరించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.ప్రజల సహకారంతో భూ రికార్డులను క్రమబద్ధీకరించి భవిష్యత్తులో భూ వివాదాలు, ఆక్రమణలు, హక్కుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని అన్నారు. రాష్ట్రంలోని భూముల యజమానులు సంతృప్తిగా ఉండటమే ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రభుత్వానికి నిజమైన ఆనందమని పేర్కొన్నారు.

### వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటల ఎంపిక

వర్షాభావ పరిస్థితులు, వాతావరణ మార్పుల నేపథ్యంలో రైతులు పంటల ఎంపికలో జాగ్రత్త వహించాలని మంత్రి సూచించారు. తక్కువ నీటితో అధిక ప్రయోజనం పొందే పంటలను ఎంపిక చేసుకోవాలని, నేల స్వభావం, నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.

శాస్త్రవేత్తల సూచనలను రైతుల అనుభవంతో సమన్వయం చేసుకుని ఆధునిక సాగు పద్ధతులను అవలంబించాలని సూచించారు. రైతు మేళాల్లో శాస్త్రవేత్తలు, వ్యవసాయ నిపుణులు, ప్రగతిశీల రైతులు అందించే సూచనలు, నూతన సాగు పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు సానుకూల దృక్పథంతో స్వీకరించాలని అన్నారు.రైతు మేళాలో నేర్చుకున్న విషయాలను తమకే పరిమితం చేయకుండా తోటి రైతులతో పంచుకోవాలని మంత్రి సూచించారు. తద్వారా ఆధునిక వ్యవసాయ పద్ధతులు మరింత విస్తృతంగా రైతులకు చేరి, వ్యవసాయంలో ఉత్పాదకత, ఆదాయం పెరిగే అవకాశం ఉంటుందని తెలిపారు.

### రైతులే గొప్ప శాస్త్రవేత్తలు

“శాస్త్రవేత్తలకంటే రైతులే గొప్ప శాస్త్రవేత్తలు. ఎన్నో ఏళ్లుగా నేలను, నీటిని, పంటలను, ప్రకృతిని పరిశీలించిన అనుభవం రైతులకు ఉంది. ఆ అనుభవానికి శాస్త్రీయ పరిజ్ఞానం తోడైతే వ్యవసాయంలో మరింత మెరుగైన ఫలితాలు సాధించవచ్చు” అని మంత్రి పొంగులేటి అన్నారు.

### రైతు మేళాలు ఎంతో ఉపయోగకరం : కలెక్టర్

జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ జిల్లాస్థాయి రైతు మేళా ద్వారా రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నూతన సాంకేతికతలు, శాస్త్రీయ విధానాలపై అవగాహన కల్పించడం ఎంతో ఉపయోగకరమన్నారు. శాస్త్రవేత్తలు, ప్రగతిశీల రైతుల సూచనలు, అనుభవాలను రైతులు సద్వినియోగం చేసుకుని వ్యవసాయంలో కొత్త విధానాలను అనుసరించాలని సూచించారు. తద్వారా పంటల ఉత్పాదకతను, రైతుల ఆదాయాన్ని పెంచుకోవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు.

### వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన

రైతు మేళాలో వ్యవసాయ, ఉద్యానవన, ఇతర శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వివిధ వ్యవసాయ, వ్యవసాయేతర ఉత్పత్తుల స్టాళ్లను మంత్రి, ప్రజాప్రతినిధులు, రైతులు సందర్శించారు. నూతన సాగు పద్ధతులు, ఆధునిక వ్యవసాయ సాంకేతికత, విత్తనాలు, పంటల సాగు విధానాలు, వివిధ ఉత్పత్తులపై రైతులు నిపుణులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ చంద్ర, ఏడీఏ ఆదిరెడ్డి, జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీపతి, జిల్లా హార్టికల్చర్ అధికారి కమలాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రావుతో పాటు వివిధ శాఖల అధికారులు, రైతు సంఘాల ప్రతినిధులు, ప్రగతిశీల రైతులు, జిల్లాలోని వివిధ మండలాల నుంచి వచ్చిన రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.


## కరెన్సీ నోట్లకు ఉండే భద్రతా ఫీచర్లను పట్టాదారు పాస్ పుస్తకాలకు ఇస్తున్నాం



**అమరావతి:** ప్రజా సమస్యల పరిష్కారమే తమ ఏకైక అజెండా అని సీఎం చంద్రబాబు అన్నారు. సుపరిపాలనే తమ మొదటి ప్రాధాన్యత అని పేర్కొన్నారు. ఏలూరు జిల్లా కలిదిండిలో చంద్రబాబు పర్యటించారు. ‘మీ భూమి-మీ హక్కు’ కార్యక్రమంలో పాల్గొన్నారు. రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ప్రసంగించారు.“ప్రధాని మోదీ ఆధ్వర్యంలో రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ సూపర్ స్పీడ్‌లో పరుగెడుతోంది. రాష్ట్రంలో రెవెన్యూ సమస్యలు పరిష్కారమయ్యే వరకూ అధికారులు గట్టిగా పని చేయాల్సిందే. పట్టాదార్ పాస్ పుస్తకంపై వేరే వాళ్ల ఫొటో వేసుకుంటే ఊరుకుంటామా? గత ప్రభుత్వ విధ్వంసం వల్ల అనేక సమస్యలు వచ్చాయి. భూసమస్యలపైనే ఎక్కువ ఆర్జీలు వచ్చాయి. ఎట్టి పరిస్థితుల్లో భూసమస్యలను పరిష్కరించాలని అనుకున్నాం.”“సమస్యలు పరిష్కరిస్తేనే జనాలు జై కొడతారు. లేకపోతే చూశాం కదా 11కి పరిమితం చేశారు. బటన్ నొక్కడం, పరదాల చాటున రావడం, సభలు పెట్టి చెట్లు నరికేయటం గత పాలకులు చేశారు. కానీ మేం ప్రతీ నెలా ప్రజల సమస్యలను తెలుసుకోవాలనే ఈ సమావేశాల ద్వారా ప్రజల్ని కలుస్తున్నాం. కరెన్సీ నోట్లకు ఉండే పటిష్టమైన భద్రతా ఫీచర్లను పట్టాదారు పాస్ పుస్తకాలకు కూడా అమలు చేస్తున్నాం. బ్లాక్ చెయిన్ టెక్నాలజీ ద్వారా ఆస్తుల వివరాలను ట్యాంపర్ చేయకుండా భద్రత కల్పించాం. క్యూఆర్ కోడ్ సహా ఇతర సాంకేతిక పరమైన భద్రతా ఫీచర్లను ఏర్పాటు చేశాం. 32.32 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాలను ఇప్పటి వరకూ రైతులకు, భూ యజమానులకు అందించాం. 9365 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి 68.64 లక్షల పాస్ పుస్తకాలు జారీ చేయాల్సి ఉంది” అని చంద్రబాబు వివరించారు.పాస్ పుస్తకాన్ని ఎవరూ ట్యాంపర్ చేయకుండా : “7450 గ్రామాల్లో 32 లక్షల 22 వేల 346 పాస్‌పుస్తకాలు ఇచ్చాం. పాస్ పుస్తకాన్ని ఎవరూ ట్యాంపర్ చేయకుండా తయారుచేశాం. ఎవరైనా ట్యాంపర్ చేసేందుకు ప్రయత్నిస్తే వెంటనే తెలిసిపోతుంది.

## రష్యాపై ఉక్రెయిన్ భారీ దాడి.

**12 మంది మృతి.39 మందికి గాయాలు**



**రష్యా:** రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత తొలిసారిగా రష్యాకు భారీ నష్టం జరిగింది. ఈ యుద్ధం మొదలైన తర్వాత ఒకేసారి అత్యధిక ప్రాణ నష్టం సంభవించింది. రష్యాపై తాజాగా ఉక్రెయిన్ జరిపిన డ్రోన్ దాడిలో ఏకంగా 12 మంది మరణించారు. మరో 39 మంది వరకు గాయపడ్డారు. సెంట్రల్ రష్యా, టాటార్‌స్తాన్ పరిధిలోని నినేకామ్స్క పట్టణంపై ఉక్రెయిన్ డ్రోన్‌తో దాడి చేసింది. ఈ విషయాన్ని స్థానిక మీడియా సోమవారం వెల్లడించింది. నినేకామ్స్క పట్టణం ఉక్రెయిన్ సరిహద్దుకు దాదాపు 1,000 కిలోమీటర్లకుపైగా దూరంలో ఉంటుంది.

## మనుషులకు ‘ఆధార్’ లాగే.. భూములకూ ‘భూధార్’




**హనుమకొండ, ఆగస్టు 10:** జిల్లాలోని ఎల్కతుర్తిలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్ పర్యటించారు. ఈ సందర్భంగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీ, పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా గత పాలకులు ఆర్భాటంగా అనేక డివిజన్లు, జిల్లాలు, మండలాలు ఏర్పాటు చేశారని.. ఎక్కడ కూడా ఆఫీసులు, ఇతరత్రా సౌకర్యాలు ఏర్పాటు చేయలేదని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ.600 కోట్లు మంజూరు చేశామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 180 రెవెన్యూ తహశీల్దార్ కార్యాలయాలు, ఆర్డీవో కార్యాలయాలను యుద్ధ ప్రాతిపదికన సంవత్సరంలోపు పూర్తి చేశామని తెలిపారు.ధరణిని బంగాళాఖాతంలో వేశామని.. భూభారతి చేపట్టి రైతులకు పూర్తి భద్రత, భరోసా ఇచ్చేలా భూములను ప్రక్షాళన చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలో ప్రతి రెవెన్యూ విలేజ్‌లోని ప్రతి అంగుళాన్ని సర్వే చేసి మనిషికి ఎలాగైతే ఆధార్ ఉందో, భూములకు కూడా భూధార్ ఇస్తామని చెప్పారు. రైతులందరి సహకారంతో భూముల విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఒక భద్రత, భరోసా కల్పిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.


నేటి సుదీక్ష
SUDIKSHA TELUGU DAILY తెలుగు దినపత్రిక

మంగళవారం, ఆగస్టు 11, 2026



# శాకాంబరి అలంకరణలో శ్రీ ఉప్పలమ్మ మాత..

**భక్తులతో కిటకిటలాడిన ఆలయం"**



**జనగామ, సుదీక్ష న్యూస్:**
ఆషాఢ మాసం చివరి ఆదివారం సందర్భంగా జనగామ జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ ఏరియా అమ్మబావి వద్ద కొలువై ఉన్న శ్రీ ఉప్పలమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు, అర్చనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ ఉప్పలమ్మ మాతను శాకాంబరి అలంకరణలో సర్వాంగసుందరంగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు.ఆషాఢ మాసం చివరి ఆదివారం కావడంతో తెల్లవారుజాము నుంచే ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. ఆలయ ప్రాంగణం భక్తుల సందడితో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. అమ్మవారిని శాకాంబరి అలంకరణలో దర్శించుకున్న భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు.ఈ సందర్భంగా ఆలయ ప్రధాన పూజారి వారణాసి పవన్ శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చారణల మధ్య అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి వివిధ రకాల పుష్పాలు, కూరగాయలు, ఆకుకూరలు తదితరాలతో శాకాంబరి అలంకరణ చేపట్టారు. శాకాంబరి రూపంలో అమ్మవారిని దర్శించుకోవడం ద్వారా సకల శుభాలు కలుగుతాయని, కుటుంబాల్లో సుఖశాంతులు నెలకొంటాయని భక్తులు విశ్వసించారు.అమ్మవారి ప్రత్యేక అలంకరణను దర్శించుకునేందుకు పరిసర ప్రాంతాల నుంచి కూడా భక్తులు తరలివచ్చారు. ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో మోహన్ గౌడ్, దేవాదాయ శాఖ ఉద్యోగి రాజేందర్ రెడ్డి, ఆలయ సిబ్బంది, అర్చకులు, సేవకులు తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.ఆషాఢ మాసం చివరి ఆదివారం సందర్భంగా శ్రీ ఉప్పలమ్మ మాతను శాకాంబరి అలంకరణలో దర్శించుకోవడంతో భక్తుల్లో భక్తిభావం వెల్లివిరిసింది. ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు కొనసాగగా, అమ్మవారి దర్శనం కోసం వచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు కిక్కిరిశాయి. అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని భక్తులు ప్రార్థించారు.

## స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సాయం అందించిఅండగా నిలిచిన మిత్రులు



**వలిగొండ ఆగస్టు 10** మండల పరిధిలోని అరూర్ గ్రామానికి చెందిన బత్తిని వెంకటేష్ తల్లి బత్తిని అంజమ్మ అనారోగ్యంతో ఇటీవల మరణించగా సోమవారం తోటి మిత్రులు వెంకటేష్ కుటుంబాన్ని పరామర్శించి 11 వేల రూపాయలు అర్థిక సాయం అందజేశారు.అలాగే రిటైర్డ్ అయిన పోస్ట్ మాన్ ఎండి సుల్తాన్ 5000 రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో తోటి మిత్రులు అంబాల రమేష్, ఎండి రంజాన్, వెలిమినేటి వెంకటేశం,వెలిమినేటి సంతోష్, కుమార్ వెలిమినేటి అశోక్, కుమార్, వెలిమినేటి మచ్చ గిరి మాటూరి శ్రీకాంత్,మెదుగుల నరేష్ ,ఎండి సుల్తాన్, బోగారం అంజయ్య, బత్తిని కర్ణ గౌడ్, బత్తిని యశ్వంత్ గౌడ్, బత్తిని సతీష్ గౌడ్ ఆర్థిక సాయం అందజేశారు.

# పెద్ది సుదర్శన్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం

**- నర్సంపేట మాజీ ఎమ్మెల్యే సంతాప సభకు కేటీఆర్, హరీశ్‌రావు హాజరు**

**- కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భరోసా**





**నర్సంపేట, సుదీక్ష న్యూస్:**
నర్సంపేట మాజీ శాసనసభ్యుడు పెద్ది సుదర్శన్‌రెడ్డి మృతి పట్ల బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయనకు నివాళులర్పిస్తూ నల్లవెల్లి గ్రామంలో నిర్వహించిన సంతాప సభకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు పలువురు మాజీ శాసనసభ్యులు, శాసన మండలి సభ్యులు, పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా పెద్ది సుదర్శన్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయనతో తమకున్న అనుబంధాన్ని కేటీఆర్, హరీశ్‌రావు తదిత రులు గుర్తు చేసుకున్నారు. పార్టీ కోసం పెద్ది సుదర్శన్‌రెడ్డి చేసిన సేవలను కొనియాడారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఆయన చేసిన కృషి, పార్టీ పట్ల ఆయనకున్న నిబద్ధత, కార్యకర్తల తో ఆయన కొనసాగించిన అనుబంధం ఎప్పటికీ గుర్తుం డిపోతాయని పేర్కొన్నారు.

**పార్టీకి అంకితమైన నాయకుడు**

పెద్ది సుదర్శన్‌రెడ్డి రాజకీయ జీవితంలో పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశారని నాయకులు అన్నారు. నర్సంపేట నియోజక వర్గంలో ప్రజలతో మమేకమై పనిచేస్తూ, వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారం కోసం నిరంతరం కృషి చేశారని గుర్తుచేశారు. కార్యకర్తలకు అందుబాటులో ఉండే నాయకుడిగా, పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే వ్యక్తిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు.సుదర్శన్‌రెడ్డితో తమకు ఉన్న అనుబం ధాన్ని కేటీఆర్, హరీశ్‌రావు ఈ సందర్భంగా అభిమానులతో పంచుకున్నారు. ఆయనతో కలిసి పనిచేసిన రోజులను గుర్తు చేసుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. పార్టీ పట్ల ఆయన చూపిన విధేయత, నిబద్ధత, నాయకత్వ లక్షణాలను కొనియాడారు.

**కుటుంబ సభ్యులకు అండగా ఉంటాం**

పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించిన బీఆర్ఎస్ నాయకులు వారికి ధైర్యం చెప్పారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆయన కుటుంబానికి మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు.సంతాప సభకు పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, శాసన మండలి సభ్యులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమాను లు హాజరై పెద్ది సుదర్శన్‌రెడ్డికి నివాళులర్పించారు. ఆయనతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ పలువురు నాయ కులు, అభిమానులు కన్నీటి పర్యంతమయ్యారు.పెద్ది సుదర్శన్‌రెడ్డి సేవలు, ప్రజలతో ఆయనకున్న అనుబంధం, పార్టీ పట్ల ఆయన చూపిన నిబద్ధత చిరస్మరణీయమని నాయకులు పేర్కొన్నారు.

## వరుణ్ యాగంలో పాల్గొన్న వలిగొండ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు



**వలిగొండ ఆగస్టు 10**
నాగార్జునసాగర్ లో నిర్వహించిన వరుణ యాగం లో వలిగొండ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.వెళ్ళినావా ప్రభావంతో వర్షాలు పడకపోవడంతో రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి దంపతులు నాగార్జునసాగర్ లో విజయ విహార్ వద్ద వరుణ యాగం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ముఖ్యమంత్రి యనమల రేవంత్ రెడ్డి దంపతులు పాల్గొన్నారు. భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఈ వర్ణ యాగంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే కు మద్దతుగా వలిగొండ మండల కేంద్రం నుండి బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డిమండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బత్తిని సహదేవ్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాసుల వెంకన్న గౌడ్ రాపోలు సుదర్శన్ తదితరులు పాల్గొని యాగంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వర్షాలు సకాలంలో కురిసి రైతులు సుభిక్షంగా ఉంటూ పంటలు పండాలని ఆకాంక్షించారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరంతరం రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నాడని అందులో భాగంగానే వర్షాలు సమృద్ధిగా కురవాలని వరుణ యాగం కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని పాశం సత్తిరెడ్డి బత్తిని సహదేవ్ తెలిపారు.

## దొరికిన నగదును పోలీసులకు అప్పగించి నిజాయితీ చాటుకున్నా లక్ష్మీప్రసన్న:



**చిట్యాల, ఆగస్టు 10**
చిట్యాల మున్సిపాలిటీ పరిధిలోని వనిపాకల రోడ్డులో రూ.36 వేల నగదు దొరకగా, దానిని పోలీసులకు అప్పగించి ఇమ్మడి లక్ష్మీప్రసన్న నిజాయితీ చాటుకున్నారు. ఈ నెల 2న సాయంత్రం 4 గంటల సమయంలో వనిపాకల రోడ్డులోని శీల రాజయ్య ఇంటి సమీపంలో యోగా కరపత్రాలు పంపిణీ చేస్తుండగా లక్ష్మీప్రసన్నకు బ్యాగు దొరికింది. ఆ బ్యాగును తెరిచి చూడగా అందులో రూ.36 వేల నగదు ఉంది. వెంటనే అక్కడ సమీపంలో ని వారిని బ్యాగు గురించి వాకాబు చేయగా మాదికాదు, మాకు తెలియదు అని చెప్పడంతో నగదు పోగొట్టుకున్న వ్యక్తి కోసం అప్పటి నుంచి కాలనీవాసులను సంప్రదించి ఆరా తీశారు. అయినప్పటికీ నగదుకు సంబంధించి ఎవరూ స్పందించలేదు.దీంతో ఈరోజు ఉదయం 11 గంటలకు చిట్యాల పోలీస్ స్టేషన్‌కు వెళ్లి రూ.36 వేల నగదుకు సంబందించిన బ్యాగును పోలీసులకు అప్పగించారు. నగదు యజమానిని గుర్తించి నగదును వారికి అందజేసేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. దొరికిన నగదును సొంతానికి వినియోగించుకోకుండా పోలీసులకు అప్పగించిన లక్ష్మీప్రసన్నను పలువురు అభినందించారు..

# వరంగల్ ఐటీఐని 'హబ్'గా అప్‌గ్రేడ్ చేయాలి

**- పీఎం-సేతు కింద ప్రత్యేక హాస్టల్ మంజూరు చేయండి**

**- కేంద్ర మంత్రి జయంత్ చౌదరికి వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య వినతి**



**న్యూఢిల్లీ, ఆగస్టు 10, సుదీక్ష న్యూస్:**
వరంగల్ ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)ను పీఎం-సేతు పథకం కింద ప్రస్తుతం ఉన్న 'స్పోక్' స్థాయి నుంచి 'హబ్'గా అప్‌గ్రేడ్ చేయడంతో పాటు, ప్రత్యేక హాస్టల్ భవనాన్ని మంజూరు చేయాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డా. కడియం కావ్య కేంద్ర నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత శాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరిని కోరారు.సోమవారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసి వినతిపత్రం అందజేసిన ఎంపీ.. వరంగల్ ప్రభుత్వ ఐటీఐ ప్రాధాన్యత, అక్కడ శిక్షణ పొందుతున్న విద్యార్థులు, భవిష్యత్‌లో ఈ ప్రాంతంలో పెరగనున్న నైపుణ్యం కలిగిన మానవ వనరుల అవసరాన్ని మంత్రికి వివరించారు.

**1,402 మంది విద్యార్థులకు శిక్షణ**

1959లో ఏర్పాటైన వరంగల్ ప్రభుత్వ ఐటీఐ ప్రస్తుతం ఎంతో మంది యువతకు సాంకేతిక, వృత్తి విద్యలో శిక్షణ అందిస్తోందని డా. కడియం కావ్య తెలిపారు. ప్రస్తుతం సుమారు 1,402 మంది విద్యార్థులు సంస్థలో వివిధ ట్రేడ్లలో శిక్షణ పొందుతున్నారని పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంతాలు, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థులు అధిక సంఖ్యలో ఐటీఐలో శిక్షణ పొందుతున్నందున, సంస్థను ఆధునిక సాంకేతిక సదుపాయాలతో మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు నైపుణ్య శిక్షణ అందించేందుకు వరంగల్ ఐటీఐని హబ్‌గా అభివృద్ధి చేయడం కీలకమని తెలిపారు.

**పారిశ్రామిక విస్తరణతో పెరగనున్న ఉద్యోగ అవకాశాలు**

వరంగల్ ప్రాంతంలో పారిశ్రామిక రంగం వేగంగా అభివృద్ధి చెందుతోందని ఎంపీ కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, ఎస్‌సీసీఎల్ భూపాలపల్లి, ఎన్టీపీసీ రామగుండం, కాకతీయ థర్మల్ పవర్ స్టేషన్, కాజీపేట--వరంగల్ రైల్వే తదితర రంగాల్లో విస్తరణతో భవిష్యత్‌లో నైపుణ్యం కలిగిన మానవ వనరులకు భారీగా డిమాండ్ ఏర్పడే అవకాశం ఉందన్నారు.
ఈ నేపథ్యంలో పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను యువతకు అందించే విధంగా ఐటీఐలో ఆధునిక కోర్సులు ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఐటీఐని హబ్‌గా అభివృద్ధి చేస్తే ఆధునిక శిక్షణ పరికరాలు, పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన కోర్సులు, అప్రెంటిస్‌షిప్ అవకాశాలు, ఉపాధి అవకాశాలు మరింత విస్తరించేందుకు అవకాశం ఉంటుందని వివరించారు.

**వరంగల్ హబ్.. ఇతర ప్రాంతాలు స్పోక్‌లు**

వరంగల్ ప్రభుత్వ ఐటీఐని హబ్‌గా, హనుమకొండ, కాజీపేట, భూపాలపల్లి, మహబూబాబాద్‌లోని సంబంధిత శిక్షణ సంస్థలను స్పోక్‌లుగా అభివృద్ధి చేయాలని డా. కడియం కావ్య ప్రతిపాదించారు.ఈ విధానం ద్వారా ఉమ్మడి ప్రాంతంలో నైపుణ్య శిక్షణను సమన్వయంతో విస్తరించవచ్చని, వివిధ ప్రాంతాలకు చెందిన యువతకు ఆధునిక సాంకేతిక శిక్షణ అందించడంతో పాటు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించవచ్చని ఆమె పేర్కొన్నారు.

**ఐటీఐ విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం కల్పించాలి**

వరంగల్ ప్రభుత్వ ఐటీఐలో ప్రస్తుతం ప్రత్యేక హాస్టల్ సదుపాయం లేదని ఎంపీ కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దూర ప్రాంతాల నుంచి ఐటీఐకి వచ్చే విద్యార్థులు ప్రతిరోజూ సుదూర ప్రయాణాలు చేయాల్సి వస్తోందని తెలిపారు.పీఎం-సేతు పథకం కింద ఐటీఐలో ఆధునిక శిక్షణ సదుపాయాలను అభివృద్ధి చేస్తున్న నేపథ్యంలో, విద్యార్థుల వసతి అవసరాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. విద్యార్థులకు వసతి, భోజనం, పారిశుద్ధ్యం, చదువుకు అనుకూలమైన వాతావరణం కల్పించేలా ఆధునిక హాస్టల్ భవనాన్ని మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని అభ్యర్థించారు.

**యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలే లక్ష్యం**

వరంగల్ ఐటీఐని హబ్‌గా అప్‌గ్రేడ్ చేయడంతో పాటు హాస్టల్ భవనానికి కూడా ప్రాధాన్యం ఇచ్చి మంజూరు చేసేలా సంబంధిత అధికారులను ఆదేశించాలని డా. కడియం కావ్య కేంద్ర మంత్రి జయంత్ చౌదరిని కోరారు.వరంగల్ ప్రాంతంలో పారిశ్రామిక రంగం విస్తరిస్తున్న నేపథ్యంలో స్థానిక యువతకు అవసరమైన నైపుణ్యాలను అందించి, వారికి మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఐటీఐలను బలోపేతం చేయడం అత్యంత అవసరమని ఎంపీ పేర్కొన్నారు.

## శ్రావణ మాస తొలి బోనాల జాతర కరపత్రాల ఆవిష్కరణ:



**చిట్యాల, ఆగస్టు 10:**
శ్రావణ మాసం తొలి బోనాల జాతర సందర్భంగా ఈ నెల 16న ధర్వేశిపురం లోని సదాశివ ఫంక్షన్ హాల్‌లో శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ తల్లికి కుమ్మర్ల ఆధ్వర్యంలో 201 బోనాలు సమర్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి నల్లగొండ జిల్లాతో పాటు వివిధ ప్రాంతాల నుంచి సుమారు 3 వేల మందికి పైగా కుమ్మర్లు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని సోమవారం ఆ సంఘం చిట్యాల మండల అధ్యక్షుడు పాకాల దినేష్, కులస్తుల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు కులస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.కరపత్ర ఆవిష్కరణ కార్యక్రమంలో మునిసిపల్ కౌన్సిలర్ నిమ్మనగోటి శ్రీను, శ్రావణమాస బోనాల ఉత్సవ కమిటీ చైర్మన్ ఎగిరిశెట్టి అనిత, జిల్లా కమిటీ సభ్యుడు తాడూరి చంద్రం, మండల ప్రధాన కార్యదర్శి ఆర్రూరి నరసింహా, ఉపాధ్యక్షులు అర్రూరి శ్రీను, ఏరుకొండ నర్సింహా, పాకాల వెంకన్న, పాకాల సత్యనారాయణ, సిరిసినవాడ వెంకన్న, ఖమ్మంపాటి నర్సింహా, బొడ్డుపల్లి శ్రీను లు పాల్గొన్నారు..

నేటి సుదీక్ష
సమాజానికి సరైన దృక్పథం
SUDIKSHA TELUGU DAILY తెలుగు దినపత్రిక

# కొత్తపల్లి బ్రిడ్జికి అప్రోచ్ రోడ్డు ఎప్పుడు?

**- వారం రోజుల్లో పనులు ప్రారంభించాలి..లేకుంటే భారీ ధర్నా**

**- ప్రతిపక్షాలను తిట్టడం మానుకుని అభివృద్ధిపై దృష్టి పెట్టండి:పద్మా దేవేందర్‌రెడ్డి**





**పాపన్నపేట,ఆగస్టు,10,**
మెదక్--బొడ్మెట్‌పల్లి ప్రధాన మార్గంలోని కొత్తపల్లి వద్ద బ్రిడ్జికి అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మా దేవేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు.సోమవారం బీఆర్ఎస్ నాయకులతో కలిసి బ్రిడ్జిని పరిశీలించి, వాహనదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ,బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.1.40 కోట్లతో బ్రిడ్జి నిర్మించినప్పటికీ అప్రోచ్ రోడ్డు లేక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.బ్రిడ్జి వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నా ప్రభుత్వం, అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు.వారం రోజుల్లోగా అప్రోచ్ రోడ్డు పనులు ప్రారంభించకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ ధర్నా చేపడతామని హెచ్చరించారు.ప్రతిపక్షాలను విమర్శించడం మానుకుని ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా కృషి చేయాలి..

**- పటాన్‌చెరులో నేడు టీయూడబ్ల్యూజే--ఐజేయూ సమావేశం**

**- సంగారెడ్డి జిల్లా జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి**



**రామచంద్రపురం ఆగస్టు 10;(**
జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఐక్యంగా కృషి చేయాలని టీయూడబ్ల్యూజే--ఐజేయూ సంగారెడ్డి జిల్లా జాయింట్ సెక్రటరీ కె. శ్రీనివాస్ రెడ్డి అన్నారు. టీయూడబ్ల్యూజే--ఐజేయూ ఆధ్వర్యంలో పటాన్‌చెరు నియోజకవర్గ సమావేశం ఆగస్టు 11న ఉదయం 11 గంటలకు రామచంద్రాపురంలోని లక్ష్మీ గార్డెన్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయిలో సంఘాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు జర్నలిస్టుల సమస్యలపై సమావేశంలో చర్చించి, వాటి పరిష్కారానికి కార్యాచరణ రూపొందించనున్నట్లు చెప్పారు. పటాన్‌చెరు నియోజకవర్గానికి టీయూడబ్ల్యూజే--ఐజేయూ కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నట్లు తెలిపారు. సమావేశానికి టీయూడబ్ల్యూజే--ఐజేయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.ఏ.కె. ఫైజల్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని తెలిపారు. సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బండారు యాదగిరి, రాష్ట్ర కమిటీ కార్యవర్గ సభ్యులు అబ్దుల్ బాసిద్, జిల్లా ప్రధాన కార్యదర్శి రుమాండ్ల అనిల్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనాథ్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు ఆసిఫ్, జనరల్ సెక్రటరీ చెన్న బసవేశ్వర్ తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని జర్నలిస్టు మిత్రులందరూ పెద్ద సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని శ్రీనివాస్ రెడ్డి కోరారు.

# ఏఎంసీడైరెక్టర్ స్టాలిన్ నర్సింలు జన్మదిన వేడుకలు

**- కేక్ కట్ చేసి శాలువాతో సన్మానించిన కాంగ్రెస్ నేతలు**



**చేగుంట, ఆగస్టు 10**
చేగుంట ఎఎంసి డైరెక్టర్ స్టాలిన్ నర్సింలు జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు రజనకు ప్రవీణ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. కేక్ కట్ చేసి స్టాలిన్ నర్సింలు గారిని శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా రజనకు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, స్టాలిన్ నర్సింలు రైతులకు, ప్రజలకు చేస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో డీసీసీ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ భాగ్యరాజ్, చేగుంట ఉపసర్పంచ్ రఫీ, ఏఎంసీ డైరెక్టర్లు అన్నం ఆంజనేయులు, మొజామిల్, మండల కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ కోండి శ్రీనివాస్, మండల కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షులు చౌదరి శ్రీనివాస్, మండల మీడియా మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

# మోడీ వినాశనకర విధానాలకు ప్రతిఘటన తప్పదు

**- రైతు, కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో హనుమకొండ కలెక్టర్ బంగ్లా సెంటర్‌లో భారీ రాస్తారోకో**

**- స్తంభించిన ట్రాఫిక్.. ఆందోళనకారులను అరెస్టు చేసిన పోలీసులు**




**హనుమకొండ, ఆగస్టు 10, సుదీక్ష న్యూస్:**
కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు, నాలుగు లేబర్ కోడ్స్ వంటి విధానాలు రైతులు, కార్మికులు, సామాన్య ప్రజల ప్రయోజనాలకు తీవ్ర నష్టం కలిగించేలా ఉన్నాయని, వాటికి వ్యతిరేకంగా ప్రతిఘటన తప్పదని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) జిల్లా కన్వీనర్లు ప్రభాకర్‌రెడ్డి, ఎన్.రెడ్డి హంసారెడ్డి, కొడగాని శివాజీ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్, ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర కార్యదర్శి గడ్డం నాగార్జున, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి మంద సంపత్ అన్నారు.సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) ఆధ్వర్యంలో రైతు, కార్మిక, ప్రజా సంఘాలు చేపట్టిన జైల్ భరో పిలుపులో భాగంగా సోమవారం హనుమకొండ కలెక్టర్ బంగ్లా సెంటర్‌లో భారీ రాస్తారోకో నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో కలెక్టర్ బంగ్లా సెంటర్ పరిసరాల్లో ట్రాఫిక్ భారీగా స్తంభించింది.

**ఆందోళనకారుల అరెస్టు**
రాస్తారోకో కొనసాగుతున్న నేపథ్యంలో పోలీసులు అక్కడికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. అనంతరం రాస్తారోకో చేస్తున్న రైతు, కార్మిక, ప్రజా సంఘాల నాయకులను పోలీసులు అరెస్టు చేసి ఆందోళనను విరమింపజేశారు. ఈ సందర్భంగా కొంతసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.
సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఉప్పల వీరయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం స్వదేశీ నినాదం చేస్తున్నప్పటికీ ఆచరణలో విదేశీ ప్రయోజనాలకు అనుకూలంగా విధానాలను రూపొందిస్తోందని ఆరోపించారు. ఇలాంటి విధానాల కారణంగా దేశీయ వ్యవసాయ రంగం, రైతాంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

**రైతాంగాన్ని సంక్షోభంలోకి నెట్టే విధానాలు**
పెరుగుతున్న వ్యవసాయ ఉత్పత్తి ఖర్చులకు అనుగుణంగా రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించడం లేదని నాయకులు అన్నారు. సరైన మార్కెట్ సౌకర్యాలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వ్యవసాయ రంగంలో నెలకొన్న సమస్యల కారణంగా రైతులు వ్యవసాయాన్ని వదిలి కూలీలుగా, కార్మికులుగా మారాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని పేర్కొన్నారు.32 దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు చేసుకుని ఆయా దేశాల ఉత్పత్తులను దేశీయ మార్కెట్‌లోకి అనుమతించడం వల్ల భారత రైతాంగంపై మరింత భారం పడుతుందని వారు విమర్శించారు. అమెరికా వంటి దేశాల్లో రైతులకు వివిధ రకాల సబ్సిడీలు, రాయితీలు కల్పిస్తూ వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహిస్తున్నారని, మన దేశంలో మాత్రం రైతాంగానికి అందుకు భిన్నమైన పరిస్థితులు ఉన్నాయని అన్నారు.

**స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను రద్దు చేయాలి**
రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతాంగ ఉద్యమం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. రైతులకు మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని, రుణ విముక్తి చట్టం తీసుకురావాలని, కేంద్ర విద్యుత్, విత్తన చట్టాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా ఉత్పత్తి రంగంలో కీలక పాత్ర పోషిస్తున్న కార్మికుల హక్కులను హరించే నాలుగు లేబర్ కోడ్స్‌ను తక్షణమే రద్దు చేసి, గతంలో అమల్లో ఉన్న కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని నాయకులు డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలని, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యథావిధిగా అమలు చేయాలని కోరారు.

**ఐక్య పోరాటానికి హెచ్చరిక**
రైతులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర ప్రభుత్వం పరిష్కరించకపోతే రైతు, కార్మిక వర్గాలు ఐక్యంగా ప్రజలందరినీ కలుపుకుని మరింత పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతాయని నాయకులు హెచ్చరించారు. ప్రజా వ్యతిరేక విధానాలను తక్షణమే ఉపసంహరించుకుని రైతులు, కార్మికుల ప్రయోజనాలను కాపాడాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రైతు, కార్మిక, ప్రజా సంఘాల రాష్ట్ర, జిల్లా నాయకులు మాస్ సావిత్రి, ప్రేమలత, రజిత, రాములు, వెంకట్, నాగార్జున, మంద సంపత్, రాగుల రమేష్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

# జనధన్ ఖాతాలు పెరిగినా.. ఆపరేటివ్ ఖాతాలు తగ్గాయి

**- గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవల విస్తరణపై లోక్‌సభలో ప్రశ్నించిన వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య**

**- జనధన్ ఖాతాల ద్వారా ప్రతి అర్హుడికి డీబీటీ ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలి**



**న్యూఢిల్లీ, ఆగస్టు 10, సుదీక్ష న్యూస్:**
ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన (గ్రావీజీణ్) ద్వారా వరంగల్ జిల్లాలో ఆర్థిక సేవల విస్తరణ, జనధన్ ఖాతాల సంఖ్య, రూపే కార్డుల జారీ, ఆధార్ అనుసంధానం, ఖాతాల నిర్వహణ, డీబీటీ ప్రయోజనాలపై వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డా. కడియం కావ్య లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ మౌలిక వసతుల విస్తరణతో పాటు డిజిటల్ చెల్లింపులు, ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాలపై కూడా ఆమె వివరాలు కోరారు.ఎంపీ డా. కడియం కావ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి సోమవారం లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. కేంద్రం వెల్లడించిన వివరాల ప్రకారం వరంగల్ జిల్లాలో ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన ఖాతాల సంఖ్య 2024 మార్చిలో 2,69,894 ఉండగా, 2026 మార్చి నాటికి 3,02,317కు పెరిగింది.అదే సమయంలో ఆధార్‌తో అనుసంధానమైన జన్‌ధన్ ఖాతాల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. 2024 మార్చిలో 2,18,133 ఖాతాలు ఆధార్‌తో అనుసంధానమై ఉండగా, 2026 మార్చి నాటికి ఆ సంఖ్య 2,65,470కు చేరినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. అలాగే రూపే కార్డుల జారీ సంఖ్య 2,12,030 నుంచి 2,26,409కు పెరిగింది.

**పెరిగిన జన్‌ధన్ ఖాతాలు.. తగ్గిన ఆపరేటివ్ ఖాతాలు**
జిల్లాలో జన్‌ధన్ ఖాతాల సంఖ్య పెరుగుతున్నప్పటికీ, వాటిలో నిరంతరం లావాదేవీలు జరిగే ఆపరేటివ్ ఖాతాల సంఖ్య మాత్రం తగ్గడం గమనార్హమని పేర్కొనవచ్చు. 2024 మార్చిలో వరంగల్ జిల్లాలో 2,28,257 జన్‌ధన్ ఖాతాలు ఆపరేటివ్‌గా ఉండగా, 2026 మార్చి నాటికి ఆ సంఖ్య 2,20,607కు తగ్గింది. జన్‌ధన్ ఖాతాలను పెద్ద సంఖ్యలో తెరవడంతో పాటు అవి నిరంతరం వినియోగంలో ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని ఈ గణాంకాలు సూచిస్తున్నాయని ఎంపీ డా. కడియం కావ్య పేర్కొన్నారు.

**గ్రామీణ ప్రజలకు బ్యాంకింగ్ సేవలు మరింత చేరువ కావాలి**
ఈ సందర్భంగా డా. కడియం కావ్య మాట్లాడుతూ.. జిల్లాలో జన్‌ధన్ ఖాతాల సంఖ్య పెరగడం స్వాగతించదగ్గ పరిణామమే అయినప్పటికీ, కేవలం ఖాతాలు తెరవడంతో ఆర్థిక సమగ్రత పూర్తికాదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేదలు, అణగారిన వర్గాలు, మహిళలు, రైతులు, కూలీలు, చిన్న వ్యాపారులు బ్యాంకింగ్ సేవలను సులభంగా వినియోగించుకునేలా మరింత మెరుగైన వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు మధ్య వర్తుల ప్రమేయం లేకుండా నేరుగా అర్హులైన లబ్ధిదారులకు చేరేందుకు బ్యాంకింగ్ సేవలు కీలకమని తెలిపారు. ముఖ్యంగా డీబీటీ ద్వారా అందే ప్రభుత్వ ఆర్థిక సహాయం ప్రతి అర్హుడికి సకాలంలో చేరేలా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని కోరారు.

**డిజిటల్ చెల్లింపులపై అవగాహన పెంచాలి**
గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ చెల్లింపుల వినియోగం పెంచేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఎంపీ సూచించారు. డిజిటల్ లావాదేవీలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు సైబర్ మోసాల పట్ల కూడా ప్రజలను అప్రమత్తం చేయాల్సిన అవసరం ఉందన్నారు.మహిళలు, రైతులు, వ్యవసాయ కూలీలు, చిన్న వ్యాపారులు తదితర వర్గాలకు ఆర్థిక అక్షరాస్యతను విస్తృతంగా అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. బ్యాంకింగ్ సేవల వినియోగం, డిజిటల్ చెల్లింపులు, ప్రభుత్వ పథకాల ద్వారా నేరుగా అందే ఆర్థిక ప్రయోజనాలపై గ్రామస్థాయిలో అవగాహన పెంచాలని కోరారు.వరంగల్‌పై ప్రత్యేక దృష్టి సారించాలివరంగల్ జిల్లాలో బ్యాంకింగ్ మౌలిక వసతులను మరింత బలోపేతం చేయాలని డా. కడియం కావ్య కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి రావడంతో పాటు ప్రతి అర్హుడికి జన్‌ధన్ ఖాతా, ఆధార్ అనుసంధానం, రూపే కార్డు, డీబీటీ ప్రయో జనాలు సక్రమంగా అందేలా కేంద్రం ప్రత్యేక దృష్టి సారిం చాలన్నారు.జన్‌ధన్ ఖాతాల సంఖ్య పెరగడంతో పాటు వాటి క్రి యాశీల వినియోగం కూడా పెరిగినప్పుడే ఆర్థిక సమగ్రత లక్ష్యం పూర్తిగా నెరవేరుతుందని ఎంపీ డా. కడియం కావ్య పేర్కొన్నారు.

# మెలూహా నుంచి 'అర్థ సూత్రం'

**బెంగళూరు,ఆగస్టు,10,**
బెంగళూరుకు చెందిన ఏఐ ఆధారిత జ్యోతిష్య వేదిక మెలూహా 'అర్థ సూత్రం' పేరుతో వ్యక్తిగత సంపద జ్యోతిష్య నివేదికను ప్రారంభించింది. వేద జ్యోతిష్య పరిజ్ఞానాన్ని కృత్రిమ మేధస్సు (ఏఐ) సాంకేతికతతో అనుసంధానించి, వ్యక్తుల ఆర్థిక సామర్థ్యం, వృత్తి అభివృద్ధి,ఆదాయ అవకాశాలు, సంపదకు సంబంధించిన ధోరణులపై వ్యక్తిగతీకరించిన అవగాహనను అందించడం ఈ నివేదిక లక్ష్యమని సంస్థ తెలిపింది.వ్యక్తి జన్మకుండలి, గ్రహాల ప్రభావాలు, సంపద, ఉద్యోగం, ఆదాయం, ఆర్థిక అవకాశాలకు సంబంధించిన జ్యోతిష్య కలయికలను విశ్లేషించి 'అర్థ సూత్రం'ద్వారా వ్యక్తిగత మార్గదర్శకత్వాన్ని అందిస్తారు.సంపద యోగాలు,అనుకూలమైన ఆర్థిక కాలాలు,వృత్తి మరియు ఆదాయ సామర్థ్యంతో పాటు వ్యక్తిగత పరిహారాలు, సూచనలను కూడా నివేదిక అందిస్తుంది.సంపదకు సంబంధించిన జ్యోతిష్య మార్గదర్శకత్వంపై వినియోగదారుల్లో ఆసక్తి పెరుగుతోందని మెలూహా తెలిపింది.సంస్థ ప్లాట్‌ఫామ్‌లోని మొత్తం ప్రశ్నల్లో దాదాపు 15 శాతం సంపదకు సంబంధించినవే కాగా, గత 12 నెలల్లో ఇటువంటి ప్రశ్నలు 50 శాతానికి పైగా పెరిగినట్లు పేర్కొంది. సంపదకు సంబంధించిన మార్గదర్శకత్వం కోరుతున్న వారిలో 65 శాతం మంది 25--44 సంవత్సరాల వయస్సు మరింత సులభంగా అందించేందుకు ఏఐని సహాయక సాంకేతికతగా ఉపయోగిస్తున్నామని సంస్థ తెలిపింది.మెలూహా వ్యవస్థాపకుడు, సీఈఓ విక్రమ్ లభే మాట్లాడుతూ, సాంకేతికత సాంకేతికతగా ఉపయోగిస్తున్నామని సంస్థ తెలిపింది.

